ఆర్టీసీ బస్సులో కలెక్టర్ ప్రయాణం

నర్సాపూర్‌లో బస్సు దిగుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, జూన్ 23: కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మెదక్ జిల్లా కేంద్రం నుంచి నర్సాపూర్ వరకు ఆర్టీసీ బస్సులో కలెక్టర్ సాధారణ ప్రయాణికులతో కలిసి ప్రయాణించి, నర్సాపూర్ బస్టాప్‌లో దిగారు. అనంతరం తన సొంత కారులో హైదరాబాద్ బయలుదేరారు.

బీవీఆర్ఐటీ కళాశాల

నేటి నుంచి సంక్షేమ అధికారుల పరీక్షలు

- పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలి
- పరీక్ష రాయనున్న 3,700 మంది అభ్యర్థులు
- నర్సాపూర్‌లోనీ బీవీఆర్ఐటీ కళాశాలలో పరీక్ష కేంద్రాలు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 23: గిరిజన, సాంఘిక, బీసీ సంక్షేమ శాఖల పరిధిలోని వసతి గృహాల సంక్షేమ అధికారుల పోస్టుల కోసం నిర్వహించే గ్రేడ్ -2 పరీక్షలు నేటి నుంచి 29 వరకు జరుగనున్నాయి. పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని అధికారులు పేర్కొన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించరని తెలిపారు. 24న ఉదయం 10 గంటల నుంచి మొదట్ సేషన్ పరీక్ష, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 3,700 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో చెక్ ఇన్ విధానంలో బయోమెట్రిక్ సమాచారం, అభ్యర్థుల ఫొటో, ఎడమ చేతి బోటన వేలు ముద్ర తీసుకోనున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు.

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో మెదక్ చర్చిలో ప్రార్థనలు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 23: సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు, పర్యాటకులు తరలి రావడంతో మెదక్ చర్చి ఆదివారం కిటకిటలాడింది. ఏసయ్య నామ స్మరణతో హోరెత్తింది. ఉదయం గంట గంటకు జరిగిన ప్రార్థనల్లో భక్తులు ఏసయ్యకు మొక్కులు సమర్పించుకున్నారు. భక్తులనుద్దేశించి చర్చి మెదక్ డయాసిస్ వైస్ చైర్మన్ రెవరెండ్ విన్‌స్టన్, ప్రేసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య, పాస్టర్లు దైవసందేశం వినిపించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువణ్ డగ్లస్, నోబుల్‌సన్, జాన్సన్, సంశాన్ సందీప్, ఫాస్టర్లు డేవిడ్, జైపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేటలో సైక్లింగ్ ర్యాలీని ప్రారంభిస్తున్న జాతీయ సైక్లింగ్ క్రీడాకారుడు

ఘనంగా అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవం

రామాయంపేట, జూన్ 23: రామాయంపేటలో అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా క్రీడల అధికారి నాగరాజు ఆదేశాల మేరకు పట్టణంలో సైక్లింగ్ క్రీడాకారుడు దండు యాదగిరి సైకిల్ ర్యాలీని, 2కె రన్‌ను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో ప్రావీణ్యం పొందితే విద్యార్థులకు భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎక్కువ శాతం యువత సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తారన్నారు. ఆయనతో ధ్యాన్‌చంద్ పీఈటీల సంఘం సభ్యుడు ప్రసాద్ ఉన్నారు.

బీడీ కార్మికులతో సీఐటీయూ నాయకురాలు బాలమణి

బీడీ కార్మికులందరికీ పీఎఫ్‌లు ఇవ్వాలి

రామాయంపేట, జూన్ 23: కేంద్ర ప్రభుత్వం బీడీలు చేసే ప్రతి కార్మికురాలికి పీఎఫ్ వర్తింపచేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. ఆదివారం రా మాయంపేటలోని ఓ బీడీ పరిశ్రమలో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మా ట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీడీ పరిశ్రమలతో ఒప్పందం కుదుర్చుకుని కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. కార్మికులకు నెలలో 11 రోజులే పని కల్పించడం సరికాదన్నారు. ఆకు తంబాకు వేయడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

పంట చేలలో దున్నకాలు చేపడుతున్న అన్నదాతలు

రామాయంపేటలో కురుస్తున్న వర్షం

కురిసిన చినుకు.. మురిసిన రైతన్న

- రామాయంపేటలో భారీ వర్షం
- పత్తి, మొక్కజొన్న విత్తనాలతో చేను చెలకల వద్దకు అన్నదాతల పరుగులు

రామాయంపేట, జూన్ 23 : రామాయంపేట పట్టణంతో పాటు మండల పరిధిలో భారీ వర్షం కురిసింది. శనివారం రాత్రి రెండు గంటల పాటు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. వర్షాకాలం ఆరంభం నుంచి నెల రోజులుగా వర్షాలు కురవక పోవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశతో ఉన్నారు. వారం రోజుల నుంచి ఆకాశం మేఘావృతమై రాత్రి 10 నుంచి 12గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో అన్నదాతలు ఆదివారం తెల్లవారుజామునే నాగళ్లు, పశువులను తీసుకొని తమ పంట చేలల్లో దుక్కి దున్నే పనులు చేపట్టారు. పలు గ్రామాల్లో రైతులు నెలరోజుల క్రితం వేసిన పత్తి, మొక్కజొన్నలు మొలకెత్తక పోవడంతో నిరాశ చెందారు. మళ్లీ వర్షం కురవడంతో మరోసారి దుక్కి దున్నడం చేపట్టి విత్తనాలను పంట చేలల్లో విత్తుకున్నారు. ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది ఆరుద్రలో వర్షం కురవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతులు చాలారోజులుగా చినుకు కోసం ఎదురుచూస్తున్నారు. శనివారం రాత్రి, ఆదివారం సాయంత్రం మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో అన్నదాతల ఆనందం అంతా ఇంతా కాదు. సాగు పనులు చేసేందుకు సిద్ధమయ్యారు. పంట పాలాలకు వెళ్లి దుక్కి దున్నే పనులు ఆరంభించారు.

అమ్మవారికి బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

బోనాల ఊరేగింపు ముందు సలను పందిరి

అమ్మవారికి ఘనంగా బోనాలు

చిన్నశంకరంపేట, జూన్ 23: మండల పరిధిలోని అంబాజిపేటలో గ్రామదేవతలు పోచమ్మ, ముత్యాలమ్మ, దుర్గామాతలకు ఆదివారం బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయాలను అందంగా అలంకరించారు. అంతకు ముందు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

కట్టమైసమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రభుత్వ బడుల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 23: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఎస్ఎఫ్ఐ ఆఫీస్ బేరర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ జిల్లాలో అనేక ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని, విద్యాశాఖాధికారులు సందర్శించి సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు దుస్తులు, నోట్‌బుక్స్ అందించలేదని ఆరోపించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, నాయకులు సంతోష్, రాకేశ్ నవీన్, జగన్, కృప పాల్గొన్నారు.

శ్యాంప్రకాశ్ ముఖర్జీకి నివాళి

శ్యాంప్రకాశ్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రామాయంపేట, జూన్ 23: శ్యాంప్రకాశ్ బలిదాన్ డే సందర్భంగా మెదక్ చౌరస్తా వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్యాంప్రకాశ్ ఏర్పాటు చేసిన భారతీయ జనసంగ్ కాలక్రమేనా భారతీయ జనతా పార్టీగా ఆవిర్భవించిందని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు భానుచందర్, శీలం అవినాశ్ రెడ్డి, వెలుముల సిద్ధరాములు, చింతల శేఖర్, నాగరాజు, కన్నయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

1987-88 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అల్లాదుర్గ్, జూన్ 23: స్థానిక జడ్పీహెచ్ఎస్‌కు చెందిన 1987-88 సంవత్సర విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం ముస్లాపూర్ గ్రామంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఎన్నో ఏండ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు, ఉపాధ్యాయులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి 54రకాల మహానైవేద్యాలను సమర్పించిన భక్తులు

ఘనంగా శివపార్వతుల కల్యాణం

- అమ్మవారికి 54 రకాల నైవేద్యాలతో నివేదన
- ముగిసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం

చేగుంట, జూన్ 23: చేగుంటలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ వార్షికోత్సవాలు ముగిశాయి. ఈ వేడుకలను చేగుంట ఆర్యవైశ్య సంఘం, అనంతసాగర్ సరస్వతీ క్షేత్ర నిర్మాత అష్టకాల నరసింహరామ శర్మ, యాజ్ఞికులు జనమంచి సీతారామ శర్మ, గౌరిబట్ల నాగరాజుశర్మ, సుధాంశు జోషి ఆధ్వర్యంలో ఆదివారం పంచముఖాంజనేయ స్వామికి మన్యసూక్తాభిషేకం, వడమాల, తమలపాకుల అలంకరణ, అమ్మవారికి 54 రకాల భోగ్ నివేదన, ప్రత్యేక కన్యకాపూజ, సువాసిని పూజ, నగరేశ్వర స్వామి, శివపార్వతుల కల్యాణోత్సవం, ఆశీర్వచనం, ఒడిబియ్యం సమర్పణ, తీర్థప్రసాద వితరణ, అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు నగేశ్, కార్యదర్శి రాఘురాములు, సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, వాసవీ క్లబ్ అధ్యక్షుడు పరంజ్యోతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శివ్వంపేట మండలంలోని దొంతి గ్రామానికి చెందిన మైనార్టీ కుటుంబానికి జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.10వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆయనతో పిట్ల సత్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు చాకలి సత్యనారాయణ, గంగం శ్రీనివాస్ గుప్తా, శ్రీకాంత్ రెడ్డి, కుమ్మరి కృష్ణ, గౌస్ ఉన్నారు. - శివ్వంపేట, జూన్ 23

హాకీలో విజయం సాధించడంపై హర్షం

హాకీలో విజేతగా నిలిచిన కల్లూరి హర్షిత్ టీం జట్టు

శివ్వంపేట, జూన్ 23: కల్లూరి హర్షిత్ కెప్టెన్సీలో అండర్-17 విభాగంలో హాకీ క్రీడల్లో విజేతగా నిలువడంపై ఎంపీపీ కల్లూరి హరికృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అండర్ -17 ఇంటర్‌నేషనల్ స్కూల్స్‌లో చదివే విద్యార్థులకు హైదరాబాద్‌లో హాకీ పోటీలు నిర్వహించారు. కల్లూరి హర్షిత్ కెప్టెన్సీలో మొదటి బహుమతి సాధించడంతో ఆ టీముకు అభినందనలు తెలిపారు.

విద్యుదాఘాతానికి యువ రైతు బలి

వేణు(ఫైల్)

చేగుంట, జూన్ 23: విద్యుదాఘాతానికి ఓ యువ రైతు బలైన ఘటన చేగుంట మండలం వడియారం గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యు వ రైతు మొగిలి వేణు(25) తన పొలం వద్ద పనిచేస్తున్నాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వైరును సరి చేసే క్రమంలో కరెంట్ షాక్ తగిలి వేణు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, కుటుంబీకులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి భార్య, ఓ పాప ఉంది.

చెరువులో పడి..

సాయి(ఫైల్)

చేగుంట, జూన్ 23: చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన తిరుపతి సాయి(21) స్నేహితులతో జరిగిన గొడవలో మరో యువకుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో భ యాందోళన చెంది చెరువులో పడి ఆత్మహ త్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

కిరాణం షాపు దగ్ధం

చేగుంట, జూన్ 23: కిరాణం షాపు దగ్ధమైన ఘటన పులిగుట్ట తండాలో ఆదివారం చోటుచేసుకున్నది. చెట్ల తిమ్మాయిపల్లి పులిగుట్ట తండాకు చెందిన కరోంట్‌తో రతన్‌కు చెందిన కిరాణం షాపు ఆదివారం తెల్లవారు జామున దగ్ధమైంది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

చేగుంట,జూన్23:నార్సింగి మండలం నర్సంపల్లిలో పైతిరి అంజయ్య (55)గత 15 రోజుల క్రితం తన దిచక్రవాహనం ట్రాక్టర్ ఢీకొనడంతో గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. మృతదేహానికి పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. గ్రామానికి మృతదేహం వస్తున్నదన్న సమాచారం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు నార్సింగికి చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలానికి రామాయమంపేట సీఐ వెంకట్ రాజ్, ఎస్సై అహ్మద్ మోయినొద్దీన్ ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

హామీలన్నీ అమలుచేయాలి

శివ్వంపేట, జూన్ 23 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షుడు మైసయ్యయాదవ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.2లక్షల రుణమాఫీ రైతులకు మేలు చేసేలా ఉండాలన్నారు.

ఇక మొబైల్ యాప్‌లో ఫీడర్ల సర్వే

ట్రాన్స్‌కో ఎస్ఈ జానకీరాములు

మెదక్ మున్సిపాలిటీ/మెదక్ అర్బన్, జూన్ 23: దక్షిణ తెలంగాణ విద్యుత్ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సమగ్ర నెట్ వర్క్ సర్వే కోసం ప్రత్యేక మొబైల్ యా ప్ రూపొందించింది. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్తు తీగలు, పరికరాలు ఏ దశలో ఉన్నాయి, ఎలా పని చేస్తున్నాయి అనే వివరాలను ఈ యాప్ ద్వారా రికార్డు చేయబోతున్నారు. ఈనెల 24 నుంచి అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ జానకీరాములు ఆదివారం తెలిపారు. మొదటి దశలో విద్యుత్తు లైన్లు సర్వే పనులను మెదక్ పట్టణంలో గల 10 ఫీడర్లను మూడు బృందాలుగా ఏర్పడి మొబైల్ ఆప్ ద్వారా జీపీఎస్‌తో అనుసంధానం చేయనున్నారు. ఏఈ, సిబ్బంది ఒక బృందంగా, సబ్ ఇంజినీర్, సిబ్బంది మరో బృందంగా, క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై సర్వే చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ యాప్ ద్వారా వచ్చిన సమాచారం బట్టి ప్రాధాన్యత వారీగా నిర్వహణ, ప్రణాళికలు రూపొందించుకోవడానికి, సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయనున్నారు. ఎక్కడి సమస్య తలెత్తినా అక్కడికెళ్లి మరమ్మతులు చేపట్టనున్నారు.

'మా కుటుంబాన్ని ఆదుకోండి...'

- ప్రాణం తీసిన కరెంటు షాక్
- పక్షవాతంతో మంచాన పడ్డ మృతుడి తండ్రి

మెదక్, జూన్ 23 (నమస్తే తెలంగాణ): వీధి లైట్లు అమర్చుతున్న కేతావత్ నరేశ్ కరెంటు కాటుకు బలయ్యాడు. ఈ ఘటన టేక్మాల్ మండలం వెంకటాపూర్ సంగ్యా తండాలో జరిగింది. కేతావత్ పడిత్యా, హున్నిబాయ్ దంపతులకు నలుగురు సంతానం. ఇందులో చివరి వాడు కేతావత్ నరేశ్(24) డిగ్రీ చదువుతున్నాడు. కూలీ నాలీ చేసుకుని జీవిస్తున్న ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. ఈ గ్రామంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి సందీప్‌రెడ్డి వీధిలైట్లు అమర్చాలని కేతావత్ నరేశ్‌కు తనతో తీసుకెళ్లాడు. తండాలోని స్తంభం పైకి ఎక్కిన నరేశ్ వీధి లైట్లు అమర్చుతున్న క్రమంలో కరెంటు షాకు గురయ్యాడు. వెంటనే అతడిని దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. ఈ మేరకు అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో కార్యదర్శి సందీప్‌రెడ్డిపై కేసు నమోదైంది. తమ కొడుకు నరేశ్ మృతికి కారణమైన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకుని, ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుని తండ్రి పడిత్యా గత కలెక్టర్‌కు విన్న వించుకున్నాడు.

కలెక్టర్ సార్ స్పందించండి: వసంత్

వెంకటాపూర్ సంగ్య తండాలో కరెంటు షాక్‌తో మృతిచెందిన కేతావత్ నరేశ్ తమ తమ్ముడని, తమ తండ్రికి పక్షవాతం వచ్చి సుమారు రూ.13 లక్షలు ఖర్చు అయ్యిందని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని నరేశ్ అన్న వసంత్ కోరుతున్నాడు. గత కలెక్టర్‌కు, డీపీవోకు సమస్య విన్నవించగా, ప్రభుత్వపరంగా సాయం అందజేస్తామని వారు చెప్పినట్లు తెలిపాడు. ఆ తర్వాత కలెక్టర్ బదిలీపై వెళ్లారు. ఇప్పటి కలెక్టర్ స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని మృతుడి అన్న వసంత్ కోరుతున్నాడు.

జేసీబీ, బైక్ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన శ్రీకాంత్ అక్క

జేసీబీ, బైక్ ఢీకొని ఒకరు మృతి

రామాయంపేట, జూన్ 23: జేసీబీ, బైక్‌ను ఢీకొని ఒకరు మృతిచెందిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరచెర్వు గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం మల్లుపల్లి గిరిజన తండాకు చెందిన మాలోత్ శ్రీకాంత్(22) రామాయంపేటలోని కోమటిపల్లి గ్రామంలో తన సోదరి ఇంటికి వచ్చి, ఆమెను తన బైక్‌పై వెంట తీసుకుని బయలుదేరాడు. మార్గమధ్యలో దామరచెర్వు శివారులో ఎదురుగా వస్తున్న జేసీబీ, బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ నడిపిస్తున్న శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి సోదరికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని గాయాలైన మౌనికను రామాయంపేట దవాఖానకు, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.